7

# కళాసి కామరాజు

ఈ అనంత జీవిత యాత్రలో ఎందరో వ్యక్తులు తారసిల్లుతూ వుంటారు. అందరూ అలా గుర్తుండిపోరు. కొందరు తిరునాళ్లలో కల్సిన యాత్రికుల్లా అనతికాలంలోనే స్మృతి పథం నుంచి చెరిగిపోతారు. కొందరు శిలా శాసనాల్లా మనసులో చెరగని ముద్ర వేసి మరీ పోతారు. ఈ రెండో కోవకు చెందిన వాడు కామరాజు.

నర్సాపురం రేవు గురించి ఎవరికైనా తెలిస్తే కామరాజు తప్పకుండా తెల్సి వుంటాడు. అలా అని అతను చరిత్రపుటల్లో చెక్కాల్సిన మహా మనిషి కాదు. చరిత్ర నిర్మాతల కంటే కూడా అందరికీ గుర్తుండే మనిషి. అతడు పౌర సంబంధ కళలో పట్టభద్రుడేం కాదు. కాని అంతకంటే ఎక్కువే! అతనికి మనుషుల్ని ఆకట్టుకునే విద్య తెల్సు. ఇంతకీ ఎవరీ కామరాజు అంటారు? అతడో దరిద్ర నిరక్షరాస్యుడు. రేవులో పడవ నడిపే కళాసీ.

దేశంలోని ప్రతి వూరికీ చరిత్ర లేకపోయినా నర్సాపురం అనే యీ వూరికి మాత్రం కొంత చరిత్ర వుంది. ఒలందులూ, పరాసులూ,విదేశీ వ్యాపారానికి ఇక్కడి నించే లంగరెత్తేరుట. దోపిడీకి దారులు వెతుక్కుంటూ పరుగెత్తిన రైలు మార్గం ఆంగ్లేయుల హయాంలోనే అలసిపోయి ఇక్కడే ఆగి పోయిందిట. పవిత్ర గోదావరి నించి విడిపోయి పరుగెత్తిన వశిష్ట ఇక్కడే బంగాళాఖాతం ఒడిలో తలదాచుకుంది.

ఉభయ గోదావరి జిల్లాలకీ ఇటునైపు అందుబాటులో వున్న ఒకే ఒక్క రైలు సౌకర్యం నర్సాపురం. దూర ప్రయాణం చేయాలనుకునే ప్రతి ఒక్కరూ ఈ పుణ్యతలి చేరుకోవాలంటే వైతరణి లాంటి యీ రేవు దాటక తప్పదు. అంచేత నర్సాపురం రేవు ఎప్పుడూ నిత్యతిరునాళ్లలా కలకలలాడుతూ వుంటుంది. కాబట్టే అది ప్రభుత్వం వారి ఆధీనంలో వుంది. అంటే, అది కంట్రాక్టర్ల బంగారు గనన్నమాట!

ఏ వృత్తికైనా ఒక పనిముట్టు, సాధనం ఏదో ఒకటి వుండి తీరాలి. కాని ఈ రేవు కాంట్రాక్టరుకు అలాంటిదేం అక్కర్లేదు. ఒక టేబులు, అమ్ముకోడానికి టికెట్టు పుస్తకాలు, కూర్చుందుకో కుర్చీ - ఇవి సాధనాలనిగాని పనిముట్లనిగాని అనలేం. అయినా వ్యాపారం సాఫీగా సాగిపోతుంది. ప్రయాణీకులకు టికెట్లమ్మి సొమ్ము చేసుకోవటం అతని వంతు. పైసాజీతం లేకుండా ప్రయాణీకుల్ని అవతలికి చేర్చే బాధ్యత సరంగులది. ఈ దోపిడీ ఎప్పుడు ప్రారంభమైందో తెలీదుగాని, ఈ 'ఆపరేషన్ ఫెర్రీ' ఒక విచిత్రమైన వ్యవస్థగా తయారైంది.

పూర్వం ఈ రేవు వేలం పాట పాడే ప్రతి కంట్రాక్టరుకూ ఒకటో రెండో పడవలు వుండేవట! కాని తర్వాత తర్వాత సాంకేతిక ప్రగతి మూడు పూవులూ ఆరు కాయలుగా విస్తరించుకుని నాటు పడవలకు బదులు మరబోటులు సముద్రం మీదికి వేటకు విహారం మొదలెట్టేక సన్నకారు బెస్తవాళ్లంతా నిర్వాసితులై రేవు కాంట్రాక్టురుకు బానిసలుగా మారిపోయారేమోనని నా అనుమానం. ఈ బానిసలు నడిపే పడవలన్నిటికీ 'పైనావ' అనే ముద్దు పేరొకటి ప్రచారంలోకి ఒచ్చేక అసలు నావలు అదృశ్యమైపోయేయి.

రేవు ఛార్జీ కంట్రాక్టరు వసూలుచేస్తే ఈ పైనావల ఆసామీలు ప్రయాణీకుల్ని బతిమాలీ, బామాలీ పావలా, అర్ధా వసూలు చేసుకుంటూ వుంటారు. అలా వసూలు చేసుకున్న సొమ్ములో సగం సాయంత్రం అయేప్పటికి కాంట్రాక్టరుకు సమర్పించుకోవాలి.

నేను నర్సాపురంలో చదువుకునే రోజుల్లో కామరాజు ఇలాంటి పైనావ ఒకటి నడుపుకుంటూ వుండేవాడు. అది అతని తండ్రి వారసత్వంగా ఒదిలిపోయిన ఓటి పడవ. దాన్ని బాగు చేసుకుందుకు కాంట్రాక్టరు దగ్గరే అయిదు వందలు అప్పుచేసి ఆ నావ నడుపుకుంటున్నాడు.

నాతోపాటే మరో ఇరవైమందిదాకా విద్యార్థులు నర్సాపురంలో చదువుకుంటూ వుండేవారు. మమ్మల్ని చూడగానే కామరాజు పరుగెత్తుకొచ్చేవాడు.

"మొదటి గంట కొట్టేసారు బాబులూ... మీకు టైముండదు. నా పడవెక్కండి అయిదు నిముషాల్లో అవతలికి తీసుకుపోతాను" అనేవాడు. అంతే, అందరూ బిలబిలమంటూ ఆ నావలోకి ఎక్కేసేవారు. ఆ తర్వాత కామరాజు పడవ తప్పితే మరోటి ఎక్కలేనంత అనుబంధం ఏర్పడిపోయింది మాకు.

ఒకోసారి నా దగ్గర డబ్బులుండేవి కావు. ఎలా పసిగట్టేవాడో ఏమో!

"బాబూ... మీ మొగం సూత్తా వుంటే సేతిలో పైసా వున్నట్టు లేదే? ఏమన్నా ఇమ్మంటారేంటి?" అనడిగేవాడు. తీసుకుంటేగాని వూరుకునే వాడు కాదు. తీసుకోకా తప్పేదికాదు. తిరిగి ఇచ్చేటప్పుడు కొంచెం ఎక్కువ ఇచ్చినా పుచ్చుకునేవాడు కాదు. తనకు రావల్సింది మాత్రమే తీసుకునేవాడు.

ఆ రోజుల్లో సఖినేటిపల్లి ప్రాంతంలో వైద్య సౌకర్యాలు అంతగా వుండేవి కావు. కాన్పువచ్చినా కడుపు నొప్పి వచ్చినా నర్సాపురం మిషను ఆస్పత్రికి పరుగెట్టాల్సి వచ్చేది.

ఒకరోజు మా పక్కింటి అమ్మాయికి పురుటి నొప్పులు ప్రారంభమై ఏదో కాంప్లికేషన్ రావటం వల్లవెంటనే నర్సాపురం తీసికెళ్లాల్సి వచ్చింది. జట్కా చేసుకుని రేవుకైతే తొందరగానే చేరుకున్నాం. కాని, రేవు దాటడమే వీలుపడలేదు. గోదారి వరద వుధృతంగా వుండటంవల్ల పడవలు నడపడం ఆపేసేరు. దానికితోడు చిరు చినుకులూ యీదురు గాలీను. అలాంటి వాత వరణంలో రేవు దాటించవద్దని పోలీసులు తాఖీదులు జారీ చేసేరు.

దిక్కు తోచక అందర్నీ బతిమాల్తున్న సమయంలో ఎక్కడి నుంచి వూడిపడ్డాడో ఏమో ముందుకొచ్చి నిలబడ్డాడు కామరాజు. కథంతా విని-

"తప్పదా బాబూ..." అనడిగేడు.

"తప్పదు కామరాజూ... ఆ అమ్మాయికి వెంటనే ఆపరేషన్ చేయాలిట, లేకుంటే బతకదు."

"అయ్యో పాపం! మరెల్లా బాబూ.. గంగమ్మ తల్లేమో పిచ్చెత్తినట్లుగా వుంది. మీకు ధయిర్యముంటే ఎలాగోలాగ తీసకపోతాననుకోండి... కాని, అవతల పోలీసోళ్లు సూసారంటే ఎమికలేరేత్తారు బాబు.. ఎలాగ?" అని కాస్సేపు ఆలోచించి-

"ఓ పన్జేద్దామేంటి బాబూ...' అన్నాడు.

"ఏదో ఉపాయం చూడు మరి"

"ఇలా కిందికెళ్ళి ఒలందుర్రేవులో దించేత్తా... అక్కణ్ణించి యే రిచ్చానో సూసుకుని ఎలిపోదురుగాని" అన్నాడు.

అవసరాన్నిబట్టి మొండి ధైర్యంతో పడవ ఎక్కేమేగాని గుండెలు చేతుల్లో పెట్టుకు కూర్చోవల్సి వచ్చింది. ఉగ్ర నరసింహంలా ఉరకలు వేస్తోంది గోదావరి. చుక్కాని నిలపటాని క్కూడా కామరాజుకు శక్తి చాలటం లేదు. ఎలాగో బతికి బైట పడి అవతలి తీరం చేరుకున్నాం. తీరా గట్టెక్కేక ప్రత్యక్షమైన ప్రధమ వ్యక్తి పోలీసు.

"ఏరా... సర్కారార్డరంటే అంత లెక్కలేకుండా వుందర్రా... పేసెంజరు ములిగి చస్తే ఎవడ్రా బాధ్యుడు లం..."అంటూ లాఠీతో బాదటం మొదలెట్టేడు. విషయం చెప్పినా విన్పించుకోలేదు. చివరికి పది రూపాయలు చేతిలో పెడితే అతనే రిక్షా పిలిచి పంపించేడు.

ఆ మర్నాడు కామరాజు కన్పిస్తేచేతులు పట్టుకుని "క్షమించు కామరాజా... నా మూలంగా నీకు దెబ్బలు తగిలేయి" అన్నాను.

"యెదవ దెబ్బలకేంగాని అమ్మాయి గారెలాగున్నారో సెప్పండి."

"ఆపరేషన్ అయింది, తల్లీ బిడ్డా కులాసాగా వున్నారు."

"అదే బాబూ కావల్సింది. యెదవ దెబ్బలు రేపటికి మానిపోవేంటి? పాపం ఆ ఆడకూతురికి ఏమైనా అయిందంటే మళ్లీ తిరిగొత్తదా బాబూ..."

అదీ కామరాజు మనసు.

కామరాజు జీవితంలో ఇలాంటి సంఘటనలు చాలా ...ఇది మచ్చుకి మాత్రమే.

నర్సాపురంలో చదువు ముగించేక పై చదువుకోసం విశాఖపట్నం వెళ్లిపోయేను. ఆ తర్వాత రెండు నెలలకి ఇంటికి రాబోతూ రేవులో కామరాజు గురించి చూసేను. ఎక్కడా కన్పించలేదు. వాకబుచేయగా పాలకొల్లుకు కొబ్బరికాయ రవాణాచేసే పడవ మీద పనికి కుదిరేడని తెల్సింది. స్వంత పడవ చెడిపోయిందిట. మళ్లీ అప్పడిగితే కంట్రాక్టరు అప్పివ్వటానికి నిరాకరించేడుట. గతిలేక అలా పరాయి పనికి పోవాల్సి వచ్చిందిట.

రెండు మూడేళ్ళ వరకూ కామరాజును చూడ్డం తటస్థ పడలేదు. ఆఖరు సంవత్సరం పరీక్షలు రాసి ఇంటికి వస్తూ వుంటే అకస్మాత్తుగా సాక్షాత్కరించేడు కామరాజు. నాలుగేళ్ళు కష్టపడి సంపాయించుకున్న డబ్బుతో పడవ బాగు చేయించుకున్నాడుట.

"మళ్లీ పడవ తిప్పుతున్నాను" అన్నాడు.

"ఎలా వుందిప్పుడు పరిస్థితి" అనడిగేను అతని పడవలో సర్దుకుని కూర్చుంటూ. ఇన్నేళ్ల తర్వాత మళ్ళీ అతని పడవ ఎక్కుతుంటే పాత అనుభూతులు తోసుకు వచ్చేయి.

పడవ లోపలికి తోసి గడతో తోస్తూ చెప్పాడు.

"ఏదో, తమ దయ వల్ల బాగానే జరుగుబాటవుతున్నది బాబూ. కాని, ఎలాగైనా ఆ రోజులు మరిరావు బాబూ. ఇప్పటి బాబులు ఒక్కడూ పైసలివ్వడు. దర్జాగా పడవ

దిగి వెళ్లిపోతారు. అంతగా అడిగితే తన్నటానికి సిద్ధపడతారు" అన్నాడు.

ఇక ఆ బాధలూ బాధ్యతలూ కెలకటం నాకిష్టం లేదు. విషయం మార్చటం కోసం "పెళ్ళి చేసుకోలేక పోయావా?"అనడిగేను.

"చేసుకోకేం బాబూ ఇద్దరు పిల్లలు కూడాను" అన్నాడు ఆనందంగా.

'ఫర్వాలేదు సంసారం సాఫీగానే సాగుతోందన్నమాట' అనుకున్నాను.

నావ గట్టు చేరాక చివరి మెట్టెక్కే వరకూ నన్నే చూస్తూ వుండి పోయాడని చటుక్కున వెనక్కి తిరిగి చూస్తే అర్థమైంది. వెళ్లొస్తానన్నట్టు చెయ్యి ఊపేను.

చెయ్యి ఊపి నావ మళ్ళించాడు.

ఉద్యోగంలో చేరేక తరచు ఇంటికి రావటం కుదిరేది కాదు. అంచేత కామరాజు గురించికూడా తెల్సేదికాదు.

రెండేళ్ల తర్వాత ఇంటికి వస్తూ రేవు టిక్కెట్టు కొనుక్కున్నాను. కాని పడవ ఎక్కనే లేదు. నది వైపూ, నదిలో అటూ యిటూ హడావుడిగా కదిలే పడవల వైపూ చూస్తూ నిలబడ్డాను. అలా ఎంతసేపు నిలబడ్డానో నాకే తెలీదు. గంగరాజు అనే పడవ కార్మికుడు దగ్గరకొచ్చిపలకరించే వరకూ నాకా స్పృహనే లేదు.

"ఏంటి బాబు... అవతలికెళ్లాలా" అనడిగేడు.

నేనేం సమాధానం చెప్పలేదు.

"నాకు తెల్సులెండి, కామరాజు కోసం సూత్తన్నారు కదా?"

అవునని చెప్పలేదు. ఎంచేతనంటే ఆ విషయం నాకు తేలీదు. కాని గంగారాజు మాట నిజమే. నాకు తెలీకుండగానే నా కళ్ళు కామరాజు కోసం వెతుకుతున్నాయి. కామరాజు పడవలో రేవు దాటక పోతే ఏదో వెల్తిగా అన్పిస్తుంది. ఆరాటపడి చూడాలని వచ్చిన ఆత్మీయులు కన్పించనంతటి బెంగగా వుంటుంది.

"కాని, కామరాజు ఇప్పుడు లేదు బాబూ."

మళ్ళీ ఏదో పడవ మీద పనికి కుదిరి వెళ్ళిపోయాడని అనుకున్నాను. వెళ్ళి అతని పడవలో కూర్చొన్నాను.

అప్పటికే చీకటి పడుతోంది. వెన్నెల నది మీద నాట్యం చేస్తోంది. కామరాజే అయితే ఆ దృశ్యానికి ఏదో ఒక చక్కని భాష్యం చెప్పేవాడు. కాని కామరాజు లేడు. అతని స్మృతులు మాత్రం నా మనస్సు నిండుగా ముసురుతున్నాయి. ఒకసారి నండూరి సుబ్బారావుగారి పాట 'వెన్నెలంతామేసి ఏరు నెమరేసింది' పాడి విన్పిస్తే 'కన్నుల్లో సెందురుడు కిల కిలా నవ్వేడు' అని మరోచరణం కలిపి మరీ పాడేడు.

అంతటి సూక్ష్మబుద్ధి కామరాజుది.

పడవ నది మధ్య సాగుతోంది. కెరటాల సవ్వడి, ఆవలి తీరంలో ప్రయాణీకుల కేకలూ తప్ప మరే సద్దూ లేదక్కడ. దూరంగా అయిదు తూముల దగ్గర్నుంచి ఆకస్మాత్తుగా ఏవో కేకలు విన్పించేయి.

'-గంగా నేనొచ్చానే... ఎక్కడున్నావు? పలకవేమే?'

'-బవానీ... గంగా బవానీ..... నీకు గాజులుతెచ్చానమ్మా... ఎంత మంచి గాజులో సూడు.. నువు కావాలన్న గాజులేనమ్మా..''

'-గంగరాజూ... నా బంగారు బాబూ.. నీకు పేంటు తెచ్చాన్రా... నీ కిష్టమైన గీతల సొక్కా కూడా తెచ్చాను.. రండిరా... ఒక్కరూ పలకరేంరా...''

కాస్సేపు మౌనం.

తర్వాత –

'-గంగా... ఆకలేత్తందే... రావే.. నీసేత్తో కాత్త బువ్వ పెట్టవే..'

ఆ కంఠం కామరాజుదే అయివుండచ్చుననే అనుమానం వున్నా ఇదమిద్ధమని తెల్సుకోలేకపోయేను.

"ఏవిటా కేకలు?'' ఉండబట్టలేక గంగరాజునడిగేను.

"ఆడే బాబూ కామరాజు... పిచ్చెత్తి పడవ మీద తిరుగుతూ రేతిరీ పగలూ అలాగే కేకలేత్తా వుంటాడు.''

ఆ కేకలు విన్నాక, అవి కామరాజువే అని రూఢి అయినాక కళ్ళుచెమర్చేయి.

"కామరాజుకు పిచ్చెక్కిందా?'' అనడిగేను.

"పిచ్చెత్తకేం చేత్తది బాబూ.... కనుకున్న బిడ్డలు, కన్నుల్లో పెట్టుకునే పెళ్ళవూ గంగలో కల్సిపోతే పిచ్చెక్కదా బాబూ''

"పిల్లలూ పెళ్లమూ చచ్చిపోయేరా? ఎందుకు'' ఆతృతగా అడిగేను.

"ఏం జెప్పమంటారు బాబూ.. అదో పెద్ద కత'' అంటూ చెప్పటం మొదలెట్టేడు.

"- ఇంతకుముందు పైనావల మీద రూపాయికి పావలా వసూలు జేసేవోడు కాంట్రాక్టరు. అర్ధంతరంగా దాన్ని అర్ధరూపాయికి పెంచాడు. తెల్లారి లేసిందగ్గర్నుంచి రేతిరి తొంగునేదాకా సల్లోనూ, వాన్లోనూ కట్టపడ్తేనే పేసెంజరు బాబుల్నుంచి అయిదు పది కంటె క్కువ రాలవు బాబూ... అసలే రోజులు మండిపోతున్నాయి.ఆ అయిదూ పదిలో సగం ఆరికిచ్చేత్తే మామూ,మా పిల్లలూ ఏమైపోవాల సెప్పండి...''

నేనేం మాట్లాడలేదు.

"-అలాగ.కుదర్దన్నాడు బాబూ కామరాజు. అదే ఆడు సేసిన తప్పు. అంతే ఆణ్ని పందిరి రాడుకి కట్టేసి సావబాదారు. ఆ కొట్టిందెవల్లో తెల్సా బాబూ... మా వోల్లే. ఆ కంట్రాక్టరు మోసేతి నీళ్ల తాగేవోళ్లు... అలాంటి జాతి బాబూ మాది".

"-తన్నటమే గాకుండా తీసుకున్న అయిదొందలూ ఒడ్డీతో కలిపి అప్పుడుకప్పుడు కక్కమన్నాడు. ఎక్కణ్ణించి తెత్తాడు సెప్పండి? ఆ పడవ కాత్తా లాగేసుకుని పొమ్మన్నాడు కంట్రాక్టరు.

"-నలుగురు పిల్లలు, పెళ్లం. ఆల్లని పెంచుకోటానికి మరో ఆదారం లేదు. పెల్లం పిల్లల్ని ఆల్ల కర్మకి ఆల్లని ఒదిలేసి ఓ రాదారి పడవ మీద బెజవాడ్ల ఎల్లిపోయాడు. ఆ పోటం పోటం మళ్ళీ ఆర్నెల్ల తర్వాత గాని తిరిగి రాలేదు బాబూ. ఆ యిల్లాలు కట్టపడి పెంచగలిగినంత కాలం పిల్లల్ని పెంచింది. తరవాత ఆమె ఒల్లగాక పోయింది. అందరూ కల్సి అదుగో అక్కడే గంగలో దూకేసారు."

గంగరాజు కళ్ళు తుడుచుకున్నాడు.

"-డబ్బు కూడ బెట్టుకుని ఆర్నెల్ల తరవాత తిరిగొచ్చాడు బాబూ కామరాజు. పడవైతే దక్కింది గాని పెళ్లం పిల్లలు మాత్రం దక్కలేదు. అప్పుడినించీ ఆ పడవేసుకుని రేతిరనక పగలనక, వోననక ఒరదనక అలాగే... అక్కడే తిరుగుతూ వుంటాడు. పెళ్ళాన్నీ పిల్లల్నీ పేరు పేరునా పిలుత్తాడు... కాని ఎవరు పలుకుతారు?"

"నీకు డబ్బులిస్తాను. కామరాజు దగ్గరికి తీసికెళ్తావా?" అనడిగేను.

కామరాజుని ఎలాగైనా అక్కణ్నించి బైటకి లాగి మళ్ళీ మనిషిని చేయాలని నా తాపత్రయం.

నా గొంతులోని గద్గదం అతన్ని కదలించి వుంటుంది.

"డబ్బులకేం లే బాబూ... ఆడి మీద తవరికంత దయవుంటే నేను డబ్బులు తీసుకోనా బాబూ... వద్దులెండి బాబూ తీసికెల్తాపదండి. కాని బాబూ.. రేతిరేల. అక్కడన్నీ సుడిగుండాలే" అని భయాన్ని వ్యక్తం చేసేడు గంగరాజు.

"ఏమైనాసరే... ఎలాగైనా నువ్వు నన్నక్కడికి తీసికెళ్లాలి"

పడవ అటు వైపు మళ్లించేడు గంగరాజు

కామరాజు కేకలు విన్పిస్తూనే వున్నాయి.

కొంచెం దగ్గరి కెళ్లేక

"కామరాజూ.. " అని పిల్చేను.

"-ఒత్తన్నారా... గంగా... నువ్వొచ్చేత్తన్నావా?" అంటున్నాడు. నాకేక అతను

విన్పించుకున్నట్టు లేదు. అతని ధోరణిలో అతను అరుస్తూ పడవని విసురుగా ఇంకా లోతట్టుకి తోసుకుంటూ అటు వైపు వెళ్ళిపోతున్నాడు.

"ఒరే కామరాజా... బాబుగారొచ్చార్రా ఇలా రారా" అని అరుస్తూనే వున్నాడు గంగరాజు.

కాని కామరాజు ఏమాత్రం వినిపించుకోలేదు. తన ధోరణిలో భార్యనీ, పిల్లల్నీ పిలుస్తూనే క్రమంగా దూరమైపోయాడు.

ఒక వేళ దగ్గరగా వొచ్చినా నన్ను గుర్తు పడతాడనుకోను.

"ఆడు ఏసందేళకోగాని మళ్ళీ యిటు రాడు బాబూ, వెళ్ళిపోదాం" అంటూ పడవవాడు వెనక్కితిప్పాడు.

ఎప్పటికైనా కామరాజు కనబడకపోతాడా, గుర్తుపట్టి పలకరించకపోతాడా – అన్న ఆశ.

అంతలోకే మళ్ళీ ఎప్పుడో ఏ సుడిగుండంలోనో చిక్కుకుని ఈ గంగమ్మ వొడిలోనే కన్ను మూస్తాడేమో నని భయం.

ఇప్పటికీ అటు ఏరుదాటేటప్పుడు కామరాజు కనబడతాడేమో అని నాకళ్ళు ఆశతో చూస్తుంటాయి. కాని ఎప్పుడూ అతను కనబడలేదు.

*(స్వాతి మాసపత్రిక, మార్చి, 1979)*